"మధురమైన పిల్లలూ - మీరు ఇక్కడకు చదువును చదువుకునేందుకు వచ్చారు, మీరు కళ్ళు మూసుకోవలసిన అవసరం లేదు, చదువును కళ్ళు తెరుచుకునే చదువుకోవడం జరుగుతుంది"

ప్రశ్న:- భక్తి మార్గములో ఇప్పుడు పిల్లలైన మీలో ఉండకూడని ఏ అలవాటు భక్తులలో ఉంటుంది?

జవాబు:- భక్తిలో ఏ దేవతా మూర్తి ఎదురుగానైనా వెళ్ళి వారిని ఏదో ఒకటి అడుగుతూ ఉంటారు. వారిలో అలా యాచించే అలవాటు ఏర్పడిపోతుంది. లక్ష్మి ఎదురుగా వెళ్తే ధనం అడుగుతారు, కానీ ఏమీ లభించదు. ఇప్పుడు పిల్లలైన మీలో ఈ అలవాటు లేదు. మీరైతే తండ్రి వారసత్వానికి అధికారులు. మీరు సత్యమైన, విచిత్రుడైన తండ్రిని చూస్తూ ఉండండి, ఇందులోనే మీ సత్యమైన సంపాదన ఉంది.

ఓం శాంతి. ఆత్మిక తండ్రి కూర్చొని ఆత్మిక పిల్లలకు అర్థం చేయిస్తున్నారు - ఇది ఒక పాఠశాల. కానీ ఇక్కడ ఏ చిత్రమును అనగా దేహధారిని చూడకూడదు. ఇటువైపు చూస్తూ కూడా ఎవరికైతే ఏ చిత్రమూ లేదో బుద్ధి వారి వైపుకు వెళ్ళాలి. స్కూల్లో పిల్లల అటెన్షన్ ఎల్లప్పుడూ టీచర్ పై ఉంటుంది ఎందుకంటే వారు చదివిస్తారు కావున తప్పకుండా వారి మాటలను వినవలసి ఉంటుంది, మళ్ళీ జవాబివ్వవలసి ఉంటుంది. టీచర్ ప్రశ్న అడిగితే - 'నేను చెప్తాను' అని పిల్లలు సైగ చేస్తారు కదా. ఇక్కడ ఇది విచిత్రమైన స్కూల్, ఎందుకంటే ఇది విచిత్రమైన చదువు, వీరికి ఎటువంటి చిత్రమూ లేదు. చదువులో కళ్ళు తెరుచుకొని కూర్చోవాలి కదా. స్కూల్లో టీచర్ ముందు ఎప్పుడైనా కళ్ళు మూసుకొని కూర్చుంటారా! భక్తి మార్గములో కళ్ళు మూసుకొని మాలను జపించడం మొదలైనవాటికి అలవాటు పడిపోయారు. సాధువులు కూడా కళ్ళు మూసుకుని కూర్చుంటారు. వారైతే మనస్సు చలించకూడదని స్త్రీల వైపు చూడను కూడా చూడరు. కానీ ఈ రోజుల్లో ప్రపంచం తమోప్రధానముగా ఉంది. తండ్రి పిల్లలైన మీకు అర్థం చేయిస్తున్నారు - ఇక్కడ మీరు శరీరాన్ని చూసినా కానీ బుద్ధి ఆ విచిత్రుడిని స్మృతి చేయడంలోనే ఉంటుంది. సాధు-సన్యాసులలో శరీరాన్ని చూస్తూ ఆ విచిత్రుడిని స్మృతి చేసేవారు ఎవ్వరూ ఉండరు. ఈ రథములో ఉంటూ ఆ తండ్రి మనల్ని చదివిస్తున్నారని మీకు తెలుసు. వారు మాట్లాడుతారు, చేసేదైతే అంతా ఆత్మయే, శరీరమైతే ఏమీ చేయదు. ఆత్మ వింటుంది. ఆత్మిక జ్ఞానాన్ని అయినా లేక దైహిక జ్ఞానాన్ని అయినా వినేది మరియు వినిపించేది ఆత్మయే. ఆత్మ దైహికమైన టీచరుగా అవుతుంది. శరీరము ద్వారా దైహికమైన చదువును చదువుతారు, అది కూడా ఆత్మయే చదువుతుంది. మంచి లేక చెడు సంస్కారాలను ఆత్మయే ధారణ చేస్తుంది. శరీరము బూడిద అయిపోతుంది. ఇది కూడా మనుష్యులెవ్వరికీ తెలియదు. నేను ఫలానాను, నేను ప్రైమ్ మినిస్టరును అని వారికి దేహాభిమానం ఉంటుంది. ఆత్మనైన నేను ఈ ప్రైమ్ మినిస్టర్ శరీరాన్ని తీసుకున్నాను అని అనరు. ఇది కూడా మీరు అర్థం చేసుకుంటారు. అంతా ఆత్మయే చేస్తుంది. ఆత్మ అవినాశీ, శరీరము కేవలం ఇక్కడ పాత్రను అభినయించేందుకే లభించింది. ఇందులో ఒకవేళ ఆత్మ లేకపోతే శరీరం ఏమీ చేయలేదు. ఆత్మ శరీరము నుండి వెళ్ళిపోతే అక్కడ ఒక శవం పడి ఉన్నట్లు ఉంటుంది. ఆత్మను ఈ కనుల ద్వారా చూడలేరు. అది సూక్ష్మమైనది కదా. కావున తండ్రి అంటారు, బుద్ధి ద్వారా తండ్రిని స్మృతి చేయండి. మమ్మల్ని వీరి ద్వారా శివబాబా చదివిస్తున్నారు అని మీకు కూడా బుద్ధిలో ఉంది. ఇవి కూడా సూక్ష్మమైన అర్థం చేసుకోవలసిన విషయాలు. కొందరు బాగా అర్థం చేసుకుంటారు, కొందరు కొద్దిగా కూడా అర్థం చేసుకోరు. విషయం ఉన్నది కేవలం ఇదే. అల్ఫ్ అనగా తండ్రి అయిన భగవంతుడు. కేవలం భగవంతుడు లేక ఈశ్వరుడు అని అనడం ద్వారా ఆ తండ్రి సంబంధం ఉండదు. ఈ సమయములో అందరూ రాతిబుద్ధి కలవారిగా ఉన్నారు ఎందుకంటే రచయిత అయిన తండ్రి మరియు రచన ఆదిమధ్యాంతాల గురించి వారికి తెలియదు. ఈ ప్రపంచ చరిత్ర మరియు భౌగోళము రిపీట్ అవుతూ ఉంటుంది. ఇప్పుడు ఇది సంగమయుగము, ఇది ఎవరికీ తెలియదు. ఇంతకుముందు మనకు కూడా తెలియదు అని మీరు భావిస్తారు. బాబా ఇప్పుడు మిమ్మల్ని ఈ జ్ఞానం ద్వారా అలంకరిస్తారు, మళ్ళీ ఇక్కడి నుండి బయటకు వెళ్తే మాయ ధూళిలో పడేసి జ్ఞాన అలంకరణను పాడు చేస్తుంది. తండ్రి అయితే అలంకరిస్తారు, కానీ తమ పురుషార్థాన్ని కూడా చేయాలి. కొంతమంది పిల్లలు ఆటవికుల్లా మాట్లాడుతారు, అసలు అలంకరణయే జరగనట్లుగా ఉంటారు, అంతా మర్చిపోతారు. ఏ విద్యార్థులైతే వెనుక కూర్చుని ఉంటారో, వారికి చదువుపై అంతగా మనస్సు లగ్నమవ్వదు. అయితే, వారు ఫ్యాక్టరీలు మొదలైనవాటిలో ఉద్యోగం చేసి షావుకార్లుగా అయిపోతారు. కానీ ఏమీ చదివి ఉండరు. ఇదైతే చాలా ఉన్నతమైన చదువు. చదువు లేకుండానైతే భవిష్య పదవి లభించదు. ఇక్కడ మీరు షావుకార్లుగా అయ్యేందుకు ఫ్యాక్టరీలు మొదలైనవాటిలో కూర్చొని పనేమీ చేయవలసిన అవసరం లేదు. అవన్నీ అంతమైపోనున్నాయి. కేవలం అవినాశీ సంపాదనయే మీతోపాటు వస్తుంది. మనుష్యులు మరణిస్తే ఒట్టి చేతులతో వెళ్తారని, తమతోపాటు ఏమీ

తీసుకువెళ్ళరని మీకు తెలుసు. మీరైతే నిండు చేతులతో వెళ్తారు, దీనిని సత్యమైన సంపాదన అని అంటారు. మీ ఈ సత్యమైన సంపాదన 21 జన్మల కొరకు ఉంటుంది. అనంతమైన తండ్రే సత్యమైన సంపాదనను చేయిస్తారు.

పిల్లలైన మీరు ఈ చిత్రాన్ని చూస్తారు, కానీ స్మృతి ఆ విచిత్రుడైన తండ్రినే చేస్తారు ఎందుకంటే మీరు కూడా ఆత్మలే, కావున ఆత్మ తన తండ్రినే చూస్తుంది, వారి ద్వారా చదువుకుంటుంది. ఆత్మను మరియు పరమాత్మను మీరు చూడరు కానీ బుద్ధి ద్వారా తెలుసుకుంటారు. ఆత్మ అయిన మనం అవినాశీ. ఈ శరీరము వినాశీ. ఈ తండ్రి కూడా ఎదురుగా పిల్లలైన మిమ్మల్ని చూస్తారు కానీ వారి బుద్ధిలో నేను ఆత్మలకు అర్థం చేయిస్తున్నాను అన్నది ఉంది. ఇప్పుడు తండ్రి పిల్లలైన మీకు ఏదైతే నేర్పిస్తారో అదంతా సత్యమే-సత్యము, ఇందులో అంశమాత్రము కూడా అసత్యము లేదు. మీరు సత్యఖండానికి యజమానులుగా అవుతారు. ఇది అసత్య ఖండము. కలియుగము అసత్య ఖండము, సత్యయుగము సత్య ఖండము - రాత్రికి, పగలుకు ఉన్నంత తేడా ఉంది. సత్యయుగములో దుఃఖము యొక్క మాటే ఉండదు. దాని పేరే సుఖధామము. ఆ సుఖధామానికి యజమానులుగానైతే అనంతమైన తండ్రే తయారుచేస్తారు. వారికి ఎటువంటి చిత్రమూ లేదు, మిగిలినవారందరికీ చిత్రాలు ఉన్నాయి. వారి ఆత్మ పేరు మారుతుందా? వారి పేరు శివ మాత్రమే. మిగిలిన వారందరినీ ఆత్మ అనే అంటారు. ఇకపోతే శరీరాలకు పేర్లు పెట్టడం జరుగుతుంది. శివలింగము నిరాకారమైనది. జ్ఞానసాగరుడు, శాంతిసాగరుడు... ఇది శివుని మహిమ. వారు తండ్రి కూడా. కావున తండ్రి నుండి తప్పకుండా వారసత్వము లభించాలి. రచనకు రచన ద్వారా వారసత్వము లభించదు. వారసత్వాన్ని రచయితయే తమ పిల్లలకు ఇస్తారు. తమ పిల్లలు ఉండగా తమ్ముడి పిల్లలకు వారసత్వాన్ని ఇస్తారా? అలాగే అనంతమైన తండ్రి తమ అనంతమైన పిల్లలకు వారసత్వాన్ని ఇస్తారు. ఇది చదువు కదా. చదువు ద్వారా మనుష్యులు బ్యారిస్టర్ మొదలైనవారిగా అవుతారు. చదివించేవారితో మరియు చదువుతో యోగము ఉంటుంది. ఇక్కడ చదివించేవారు విచిత్రుడు. ఆత్మలైన మీరు కూడా విచిత్రులే. తండ్రి అంటారు, నేను ఆత్మలను చదివిస్తాను. మమ్మల్ని తండ్రి చదివిస్తున్నారు అని మీరు కూడా భావించండి. తండ్రి ఒకేసారి వచ్చి చదివిస్తారు. చదివేదైతే ఆత్మయే కదా. సుఖ-దుఃఖాలను ఆత్మయే అనుభవిస్తుంది, కానీ శరీరము ద్వారా అనుభవిస్తుంది. ఆత్మ వెళ్ళిపోతే ఇక శరీరాన్ని ఎంత కొట్టినా అది మట్టిని కొట్టినట్లే. కావున తండ్రి పదే-పదే అర్థం చేయిస్తున్నారు, స్వయాన్ని ఆత్మగా భావిస్తూ తండ్రిని స్మృతి చేయండి. నంబరువారుగా ధారణ చేస్తారని బాబాకు తెలుసు. కొందరైతే పూర్తిగా బుద్ధిహీనుల వలె ఉన్నారు, వారు ఏమీ అర్థం చేసుకోరు. జ్ఞానమైతే చాలా సహజమైనది. అంధులు, వికలాంగులు, కుంటివారు కూడా అర్థం చేసుకోగలరు ఎందుకంటే ఇది ఆత్మకు అర్థం చేయించడం జరుగుతుంది కదా. ఆత్మ వికలాంగముగా, కుంటిదిగా అవ్వదు. శరీరమే అలా అవుతుంది. తండ్రి ఎంత బాగా అర్థం చేయిస్తారు, కానీ భక్తి మార్గపు అలవాటు వల్ల కళ్ళు మూసుకొని కూర్చునే అలవాటు ఏర్పడింది కావున ఇక్కడ కూడా కళ్ళు మూసుకొని కూర్చుంటారు. నషాలో ఉన్నట్లు కూర్చుంటారు. తండ్రి అంటారు, కళ్ళు మూసుకోకండి. ఎదురుగా చూస్తూ కూడా బుద్ధి ద్వారా తండ్రినే స్మృతి చేయండి, అప్పుడే వికర్మలు వినాశనమవుతాయి. ఇది ఎంత సహజము, అయినా కానీ, బాబా, మేము స్మృతి చేయలేకపోతున్నాము అని అంటారు. అరే, ఏ లౌకిక తండ్రి నుండైతే హద్దులోని వారసత్వము లభిస్తుందో, వారినైతే మరణించేంతవరకూ తలచుకుంటారు, వీరైతే సర్వాత్మల అనంతమైన తండ్రి, వీరిని మీరు స్మృతి చేయలేరా. ఆ తండ్రిని మీరు - ఓ గాడ్ ఫాదర్, నన్ను గైడ్ (మార్గదర్శనం) చేయండి అని పిలుస్తారు కూడా. వాస్తవానికి అలా అనడం కూడా తప్పే. తండ్రి కేవలం ఒక్కరికే గైడ్ కాదు, వారు అనంతమైన గైడ్. వారు ఒక్కరినే విముక్తులను చేయరు కదా. తండ్రి అంటారు, నేను వచ్చి అందరికీ సద్గతిని ఇస్తాను, అందరినీ శాంతిధామములోకి పంపించేందుకే నేను వచ్చాను. ఇక్కడ యాచించవలసిన అవసరం లేదు. వీరు అనంతమైన తండ్రి కదా. వారైతే హద్దులోకి వచ్చి నాకు, నాకు అని అంటూ ఉంటారు. ఉదాహరణకు - ఓ పరమాత్మ, నాకు సుఖాన్ని ఇవ్వండి, దుఃఖాన్ని తొలగించండి, మేము పాపులుగా, నీచులుగా ఉన్నాము, మీరు దయ చూపించండి అని అంటారు. తండ్రి అంటారు, నేను అనంతమైన పాత సృష్టిని కొత్తగా చేయడానికి వచ్చాను. కొత్త సృష్టిలో దేవతలు ఉంటారు, నేను ప్రతి 5000 సంవత్సరాల తర్వాత వస్తాను, ఎప్పుడైతే మీరు పూర్తిగా పతితులుగా అయిపోతారో అప్పుడు వస్తాను. ఇది ఆసురీ సాంప్రదాయము. సత్యాన్ని వినిపించే సద్గురువైతే ఒక్కరే. వారే తండ్రి కూడా, టీచర్ కూడా, సద్గురువు కూడా. తండ్రి అంటారు, ఈ మాతలే స్వర్గ ద్వారాలను తెరుస్తారు. గేట్ వే టు హెవెన్ అని వ్రాయబడి కూడా ఉంది. కానీ మనుష్యులు ఇది కూడా అర్థం చేసుకోలేరు. నరకంలో పడి ఉన్నారు కదా, అందుకే పిలుస్తూ ఉంటారు. ఇప్పుడు బాబా మీకు స్వర్గములోకి వెళ్ళే మార్గాన్ని తెలియజేస్తారు. తండ్రి అంటారు, నేను పతితులను పావనులుగా తయారుచేయడానికి, మళ్ళీ తిరిగి తీసుకువెళ్ళడానికి వస్తాను. ఇప్పుడు స్వయాన్ని ఆత్మగా భావిస్తూ తండ్రిని స్మృతి చేసినట్లయితే మీ పాపాలు అంతమైపోతాయి. మాయను జయించి జగత్ జీతులుగా అవ్వండి అని తండ్రి చెప్తున్నారు అన్న ఈ ఒక్క విషయాన్నే అందరికీ వినిపించండి. నేను

మీ అందరికీ జగత్తుకు యజమానులుగా అయ్యే మార్గాన్ని తెలియజేస్తాను. లక్ష్మికి దీపావళి నాడు పూజ చేస్తారు, ఆమెను ధనం కోరుకుంటారు, అంతేకానీ ఆరోగ్యాన్ని బాగు చేయండి, దీర్ఘాయువును ఇవ్వండి అని అడగరు. మీరైతే తండ్రి నుండి వారసత్వాన్ని తీసుకుంటారు. ఆయుష్షు ఎంత పెద్దగా అవుతుంది. ఇప్పుడు ఆరోగ్యము, సంపద, సంతోషము అన్నింటినీ ఇస్తారు. వారైతే లక్ష్మిని కేవలం రాతి పెంకులు కోరుకుంటారు, కానీ అది కూడా ఎక్కడ లభిస్తుంది. అది ఒక అలవాటుగా అయిపోయింది. భిక్షం యాచించేందుకు దేవతల ముందుకు వెళ్తారు. ఇక్కడైతే మీరు తండ్రి నుండి ఏమీ అడగకూడదు. మీకైతే బాబా చెప్తున్నారు - నన్నొక్కరినే స్మృతి చేసినట్లయితే యజమానులుగా అయిపోతారు మరియు సృష్టి చక్రాన్ని తెలుసుకోవడం ద్వారా చక్రవర్తీ రాజులుగా అయిపోతారు. దైవీ గుణాలను కూడా ధారణ చేయాలి. ఇక్కడ తండ్రి నుండి స్వర్గ వారసత్వము లభిస్తుంది కావున ఇందులో ఏమీ మాట్లాడవలసిన అవసరం లేదు. ఇప్పుడు మీరు వీరి పూజను చేస్తారా! మేము స్వయమే ఈ విధంగా అవుతున్నాము అని మీకు తెలుసు కావున ఈ పంచ తత్వాలను ఏం పూజిస్తారు. మాకు విశ్వ రాజ్యాధికారము లభిస్తోంది కావున దీనిసేమి చేసుకుంటాము. ఇప్పుడు మీరు మందిరాలు మొదలైన స్థానాలకు వెళ్ళరు. తండ్రి అంటారు, ఇవన్నీ భక్తి మార్గపు సామాగ్రి. జ్ఞానములోనైతే ఒకటే మాట ఉంది - నన్నొక్కరినే స్మృతి చేయండి. కేవలం స్మృతి ద్వారానే మీ పాపాలు అంతమవుతాయి, సతోప్రధానులుగా అవుతారు. మీరే సర్వ గుణ సంపన్నులుగా ఉండేవారు, మళ్ళీ మీరే అలా అవ్వవలసి ఉంటుంది. ఇది కూడా అర్థం చేసుకోరు. రాతిబుద్ధి కలవారి వెనుక తండ్రి ఎంతగా కష్టపడవలసి వస్తుంది. ఈ నిశ్చయం ఉండాలి. ఈ విషయాలను ఒక్క తండ్రి తప్ప సాధు-సన్యాసులు మొదలైనవారెవ్వరూ చెప్పలేరు. ఇతను ఈశ్వరుడేమీ కారు. ఇతను అనేక జన్మల అంతిమంలో ఉన్నారు. ఎవరైతే పూర్తి 84 జన్మలను తీసుకున్నారో, నేను అతనిలోకే ప్రవేశిస్తాను. ఇతను ఒక పల్లెటూరి బాలుడిలా ఉండేవారు, మళ్ళీ శ్యామ-సుందరునిగా అవుతారు. ఇతనైతే పూర్తిగా పల్లెటూరి బాలుడిలా ఉండేవారు. మళ్ళీ ఎప్పుడైతే సాధారణంగా అయ్యారో అప్పుడు బాబా ప్రవేశించారు ఎందుకంటే ఇంత పెద్ద భట్టీ తయారవ్వవలసి ఉంది, మరి వీరికి ఎవరు తినిపిస్తారు? కావున తప్పకుండా సాధారణమైనవారు కూడా కావాలి కదా. ఇవన్నీ అర్థం చేసుకోవలసిన విషయాలు. తండ్రి స్వయం అంటున్నారు, నేను ఇతని అనేక జన్మల అంతిమంలో ప్రవేశిస్తాను, ఎవరైతే అందరికన్నా పతితునిగా అయ్యారో అతనే మళ్ళీ అందరికన్నా పావనంగా కూడా అవుతారు. 84 జన్మలను ఇతనే తీసుకున్నారు, తతత్వం. అలా ఇతనొక్కరే కాదు కదా, ఎంతోమంది ఉన్నారు కదా. సూర్యవంశీయులుగా, చంద్రవంశీయులుగా అయ్యేవారే ఇక్కడకు నంబరువారు పురుషార్థానుసారంగా వస్తారు. మిగిలినవారెవరూ నిలవలేరు. ఆలస్యంగా వచ్చేవారు జ్ఞానాన్ని కూడా కొద్దిగానే వింటారు, మళ్ళీ ఆలస్యంగానే వస్తారు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. తండ్రి ఏ జ్ఞాన అలంకరణను అయితే చేస్తారో, దానిని నిలుపుకునే పురుషార్థం చేయాలి. మాయ యొక్క ధూళిలో జ్ఞాన అలంకరణను పాడుచేసుకోకూడదు. చదువును బాగా చదువుకుని అవినాశీ సంపాదనను చేసుకోవాలి.

2. ఈ చిత్రాన్ని అనగా దేహధారిని ఎదురుగా చూస్తూ బుద్ధి ద్వారా విచిత్రుడైన తండ్రిని స్మృతి చేయాలి. కళ్ళు మూసుకుని కూర్చునే అలవాటు చేసుకోకూడదు. అనంతమైన తండ్రి నుండి ఏమీ యాచించకూడదు.

వరదానము:- సమయము యొక్క మహత్వాన్ని తెలుసుకుని ఫాస్ట్ నుండి ఫస్ట్ లోకి వచ్చే తీవ్రగతి యొక్క పురుషార్థీ భవ

అవ్యక్త పాత్రలో వచ్చిన ఆత్మలకు లాస్ట్ నుండి ఫాస్ట్, ఫాస్ట్ నుండి ఫస్ట్ లోకి వచ్చే వరదానము ప్రాప్తించింది. కనుక సమయము యొక్క మహత్వాన్ని తెలుసుకుని లభించిన ఈ వరదానాన్ని స్వరూపములోకి తీసుకురండి. ఈ అవ్యక్త పాలన సహజంగానే శక్తిశాలిగా తయారుచేసేటువంటిది, అందుకే ఎంత ముందుకు వెళ్ళాలనుకుంటే అంత ముందుకు వెళ్ళగలరు. బాప్ దాదా మరియు నిమిత్త ఆత్మలకు సర్వుల పట్ల - 'వీరు సదా ముందుకు ఎగరాలి' అన్న ఆశీర్వాదాలు ఉన్న కారణంగా తీవ్రగతి యొక్క పురుషార్థపు భాగ్యము సహజంగానే లభించి ఉంది.

స్లోగన్:- ''నిరాకారము నుండి సాకారము'' - ఈ మహామంత్రపు స్మృతి ద్వారా నిరంతర యోగులుగా అవ్వండి.